

జోష్..

సందడిగా యానాం ప్రజా ఉత్సవం

ప్రతి ఏటా పండుగగా జరిగే యానాం ప్రజా ఉత్సవం ఈసారీ సందడిగా జరుగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ వేడుకలు బుధవారం రాత్రితో ముగుస్తాయి.



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

మార్పు మీతోనే సాధ్యం!

- ఉన్నతమైన సమాజం నిర్మాణం వారి ద్వారానే..
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో పేర్కొన్న కాకినాడ జిల్లా కలెక్టర్

కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలలో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కూడా పాల్గొన్నారు. - వివరాలు 6లో



తెలుగు పండుగకు ముస్తాబు

- నేడు, రేపు జీజీయూలో ప్రపంచ తెలుగు మహా సభలు
- జీజీయూ కులపతి చైతన్యరాజు సారథ్యంలో ఏర్పాట్లు పూర్తి

- రాజానగరం

సంక్రాంతికి పోలీస్ స్టేషన్లలో క్రీడలు

జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు జిల్లాలో జూద క్రీడలకు చెక్‌పెడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం కొత్తగా సంప్రదాయ క్రీడల పోటీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎస్పీ డి.నరసింహకిషోర్ మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. యువత దృష్టిని చెడు వ్యసనాల వైపు మరలకుండా సంక్రాంతి పండుగకు పోలీస్ స్టేషన్ల వారీగా సంప్రదాయ క్రీడలు చేపట్టాలని ఆదేశించారు. యువతకు ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు.రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం గత ఐదేళ్లగా నమోదైన ఆస్తి నేరాలపై ఎస్‌హెచ్‌వోలతో సమీక్షించారు. పాత ఆస్తి నేరస్తులపై తప్పక నిఘా ఉంచాలని ఆదేశించారు.2019 నుంచి 2024 మధ్య జరిగిన ఆస్తి నేరాల్లో నిందితులను పట్టుకొని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పి (అడ్మిన్) ఎన్‌బీఎం.మురళీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్ (ఎస్ బీ)అనసూరి శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి , ఐటి కోర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పోలీసులతో మాట్లాడుతున్న ఇరు గ్రూపుల మహిళలు

జనరిక్ మెడికల్ షాపునకు తాళం

రెండో రోజు తారస్థాయికి మందుల షాపు వివాదం

- కలెక్టర్ ఆదేశాలతో తాళం
- జీజీటీహెచ్ వద్ద ఇరుగ్రూపులు
- రణరంగంగా మారిన ఆసుపత్రి
- పోలీసుల రంగప్రవేశం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీటీజీహెచ్ (ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి) లోని ప్రభుత్వ జనరిక్ మందుల షాపు వివాదం ముదురుతుండడంతో రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్ పాపారావు మంగళవారం సాయంత్రం తాళం వేయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మందుల షాపునకు తాళం వేయిస్తున్నామని పేర్కొన్నారు. వివాదం తేలే వరకూ రెండు గ్రూపుల వారు ఇక్కడకు రావొద్దని సూచించారు. దీంతో ఈ వివాదానికి తాత్కాలికంగా తెరపడింది. జనరిక్ మందుల షాపు వివాదం మంగళవారం మరింత తారస్థాయికి చేరింది. రెండు మహిళా గ్రూపులకు చెందిన నాయకులు, మద్దతుదారులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంగణమంతా గందరగోళంగా మారింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు చెందిన వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. రెండు గ్రూపుల నుంచి లీగల్ నాలెడ్జి, రూల్ పొజిషన్ తెలిసిన ప్రతినిధులు కూర్చుని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని పోలీసులు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా ఏ ఒక్కరూ తగ్గలేదు. రెండు మహిళా గ్రూపులు అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన మద్దతుదారులే కావడంతో పాటు పార్టీ నాయకులు సిటీ, రూరల్‌గా విడిపోయారు. దీంతో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందనే దానిపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. పోలీసులకు కూడా ఈ సమస్య సున్నితంగా మారడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ఇదిలా ఉంటే సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయం వరకూ వివాదం నడిచినా ఆ తర్వాత సద్దుమణిగింది. ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. మళ్లీ మంగళవారం పొద్దునే రెండు గ్రూపుల నాయకులు, మద్దతుదారులు ఆసుపత్రికి చేరుకోవడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. కలెక్టర్ ఆదేశాలతో తహశీల్దార్ పాపారావు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని షాపునకు తాళం వేయించారు. షాపులో విలువైన మందులు ఉన్నాయని, నష్టపోతామని మహిళా సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.దీంతో వారితోనే షాపునకు తాళం వేయించి వారికే అప్పగించారు.



అలరించేలా!



అన్నవరం ఆలయం

పర్యాటకాభివృద్ధిపై యాక్షన్ ప్లాన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకేం తక్కువ.. అందమైన బీచ్‌లు లేవా.. ఆహ్లాదం పంచే ప్రకృతి ప్రదేశాలు లేవా.. ఆధ్యాత్మికతను పెంచే ఆలయాలు లేవా.. అన్నీ ఉన్నాయి.. అయినా ఏదో వెలితి.. పర్యాటకాభివృద్ధిలో ఎప్పుడూ వెనుకబాటే.. కేరళను మించి అందాలున్నా.. గోవాను మించి బీచ్‌లున్నా ఎందుకో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 బీచ్‌లను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రచించింది.. అంతే కాదు ఆలయాలకు కొత్త రూపు తీసుకురానున్నారు.. సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.. ఫిబ్రవరి నాటికి పర్యాటకంపై నివేదిక ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మూడు జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేస్తున్నారు.

- పర్యాటకానికి స్వర్ణాంధ్ర-2047
- ఐదేళ్లలో ప్రణాళికలపై కసరత్తు
- 18 బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు
- దానవాయిపేట బీచ్‌కు రూ.10 కోట్లు
- హోప్ ఐలాండ్‌కు రూ.8 కోట్లు
- అన్నవరం కొండపై రోప్‌వే
- కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు రూ.5 కోట్లు
- తలుపులమ్మ లోవకు రూ.6 కోట్లు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పర్యాటక రంగాన్ని పరుగులు తీయించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సుదీర్ఘసాగర తీరం దగ్గర నుంచి ప్రఖ్యాత ఆలయాల వరకు పర్యాటకుల కోసం భారీ ప్రాజెక్టులకు పట్టాలెక్కించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో పూర్తిగా కుంటుపడిన పర్యాటక రంగాన్ని గాడినపెట్టేలా అనేక ప్రతిపాదనలతో విజన్‌ప్లాన్ తయారు చేసింది.ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కార్యాచరణ కసరత్తును ప్రభుత్వానికి పంపించారు. అందులో భాగంగా జిల్లాలో సుదీర్ఘ తీర రేఖ పొడవునా అనేక అందమైన బీచ్‌లున్న నేపథ్యంలో వాటిలో ముఖ్యమైన వాటిని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చేయనున్నారు.

మురిపించేలా...

కాకినాడ జిల్లా ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. తొండంగి నుంచి కాకినాడ వరకు సువిశాల సాగరతీరం పర్యాటకులను ఆకర్షిస్తోంది. సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ పర్యాటకులను కట్టిపడేస్తుంది. కోరంగి మడ అడవులు ఎంతో ప్రసిద్ధి. అన్నవరం నుంచి తలుపులమ్మ లోవ, సామర్లకోట భీమేశ్వరస్వామి, పిఠాపురం పురుహూతికా అమ్మవారి ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. జాతీయస్థాయి పర్యాటకులను ఆకర్షించే సత్తా ఉన్నప్పటికీ జిల్లాను గత వైసీపీ ప్రభుత్వం పర్యాటకంగా గాలికొదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటకరంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఐదేళ్ల విజన్ ప్లాన్ తయారు చేస్తోంది. ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్వర్ణాంధ్ర-2047 పేరుతో జిల్లాలో 2029లోగా పర్యాటక రంగం అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రూ.35కోట్లతో పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనల ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 18 బీచ్‌లను ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద అభివృద్ధి చేసే అవకాశం ఉందని నివేదికలో వివరించారు. తొలుత తొండంగి మండలంలోని దానవాయిపేటలోని బీచ్‌ను రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారు. వాస్తవానికి ఇక్కడ బీచ్ సువిశాలంగా ఉంటుంది. పర్యాటకులకు సురక్షితంగా ఉంటుంది. అలల తీవ్రత చాలా తక్కువ. పైగా ఇక్కడి నుంచి జాతీయ రహదారి సైతం చాలా దగ్గర.ఈ బీచ్‌ను రూ.10 కోట్లతో తీర్చిదిద్దాలని ప్రతి పాదించారు. అన్నవరం దేవస్థానానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా, పశ్చిమ బెంగాల్ నుంచి భక్తులు వేలల్లో వస్తుంటారు. రత్నగిరి కొండ నుంచి సత్యగిరి కొండకు 800 మీటర్ల పొడవునా రూ.6 కోట్లతో రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి దగ్గర్లోనే దానివాయిపేట బీచ్ కూడా ఉండడంతో పర్యాటకపరంగా ఈ ప్రాంతానికి మరింత ఆదరణ లభిస్తుందని అంచనా వేశారు. కాకినాడ తీరం నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే వచ్చే హోప్ ఐలాండ్ పర్యాటక పరంగా పేరొందింది.గత వైసీపీ ప్రభుత్వం హోప్ ఐలాండ్‌ను గాలికొదిలేసింది. బోటింగ్ నిలిపివేసింది.దీంతో పర్యాటకులు ఉసూరోమంటున్నారు.హోప్ ఐలాండ్‌కు తిరిగి నాటి వైభవం వచ్చేలా చేయడంతో పాటు ఎకో టూరిజం ప్రాజెక్టు కింద రూ.8 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అనేకమంది వస్తుంటారు.ఇక్కడ ఇప్పటికీ కనీస సదుపాయాలు లేవు.చీకటైతే చిన్న లైట్ ఉండదు.ఈ బీచ్ వద్ద రూ.5 కోట్లతో సర్వహంగులు తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. బీచ్ ఫ్రంట్ వద్ద కన్వెన్షన్ హాల్ నిర్మించనున్నారు. తలుపులమ్మ లోవ ఆలయం వద్ద రూ.6 కోట్లతో వివిధ వసతులను తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. కాకినాడ జిల్లాలో మొత్తం ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద 18 బీచ్‌లను తీర్చిదిద్దాల్సి ఉందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో వివరించారు.అటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కోనసీమలో హోటళ్ల, రిసార్టుల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తున్నాయని..వీటికి అనువైన భూములు గుర్తించి పంపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

టార్గెట్ ఫిబ్రవరి

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఫిబ్రవరి నాటికి నివేదికలు పంపాలని కలెక్టర్లను ఆదేశించింది. ప్రధానంగా కాకినాడ కోరంగి వద్ద ఫోర్ సీజన్ హోటల్ పెట్టుబడులకు ముందుకు వచ్చింది.దీనికి 40 ఎకరాలను ఎంపిక చేసి ప్రతి పాదలను పంపాలని సూచించింది.రాజమహేంద్రవరంలో ఐఆర్‌సీటీసీకి 3 ఎకరాలను అన్వేషించి వివరాలు పంపాలని కోరింది. కోనసీమలోని పిచ్చుకలంక వద్ద మహీంద్రా హాలిడేస్ క్లబ్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇందుకు 26 ఎకరాల వరకు అవసరమని అంచనా వేశారు.దీనికి సంబంధించి నివేదికలను ఫిబ్రవరిలో పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. స్వదేశీ దర్శన్ స్కీం కింద కోనసీమ, పాపికొండలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీటికి భారీగా నిధులు రానున్నాయి. ఏడు పర్యాటక యాంకర్ హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో రాజమహేంద్రవరంలో పర్యాటకపరంగా ఇంకా ఏమేం చేయాలనే దానిపై సలహాలు, సూచనలు, ఆలోచనలు ఫిబ్రవరిలోగా పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.



వైరస్‌పై ఆందోళన వద్దు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇదిగో వైరస్ వచ్చేసిందంటూ సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో మంగళవారం ఆయన రాజమహేంద్రవరం జీటీజీహెచ్ (ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి)లో పల్మనాలజిస్ట్ డాక్టర్ రవికిరణ్, ఆర్‌ఎంవో డాక్టర్ ప్రణవ్, ఇతర వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఇతర వైద్యపరమైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరస్ విషయంలో ప్రజలు తప్పనిసరిగా మాస్కు ధరించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ అంతటి ప్రమాదకరమైందని కాదన్నారు.ఏ మాత్రం అనారోగ్యంగా ఉన్నా, జలుబు చేసినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముందుజాగ్రత్తగా రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేసినట్టు తెలిపారు.

పండుగకు విజిట్రబుల్స్!



- కూరగాయలు అధరహో
- కొనుగోలుదారులు బెధరహో
- బహిరంగ మార్కెట్లలో దోపిడీ
- కిలో రూ.20పైనే పెంచి విక్రయం
- రైతు బజార్లలోనూ ధరల బేజార్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. రైతు బజార్లలోనే కిలో టమాటా రూ.16 నుంచి రూ.18 లకు విక్రయిస్తున్నారంటే బహిరంగ మార్కెట్లలో పరిస్థితిని ఊహించవచ్చు. రైతు బజార్లలో ధరల కంటే బహిరంగ, చిల్లర మార్కెట్లలో రెట్టింపు, అంతకు మించి ధరల్లో కూరగాయలను విక్రయిస్తున్నారు. బహిరంగ, చిల్లర మార్కెట్లలో దొండకాయలు, బెండకాయలు కిలో రూ.70-రూ.80పైనే అమ్ముతున్నారు. బెండ, దొండకాయలతో సమానంగా బీరకాయలు రేట్లు పలకడం గమనార్హం. పచ్చిమిర్చి రూ.60లకు చేరింది. గుత్తి వంకాయ (గులాబీ రకం) రూ.80,చేమ దుంపలు రూ.80, మీడియం సైజు ఆనబకాయ రూ.50, ములక్కాడ ఒకటి రూ.15, చిక్కుళ్లు రూ.150 ఇలా అన్ని కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కేరట్, బీట్‌రూట్ కిలో రూ.100కు చేరుకున్నాయి. కేప్సికం రూ.130లకు పెరిగింది. రైతు బజార్లలో కిలో టమాటా రూ.16లు ఉంటే బహిరంగ,చిల్లర మార్కెట్లో రూ.40లు చెబుతున్నారు.ఈ లెక్కన రైతుబజార్లలో రూ.20ల కంటే తక్కువకే కిలో టమాటాలు వస్తాయన్నమాట.ఇలా బహిరంగ మార్కెట్లలో ధరల మోత మోగుతోంది.

రైతు బజార్లలో ధరలిలా..

రైతుబజార్లలోనూ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. రైతుబజార్లలో ఆదివారం కిలో టమాటా రూ.16లకు, దొమ్మేరు వంకాయలు రూ.54, గులాబీ రకం రూ.44, నలుపు (జాళ్లు) రూ.38, తెలుపు (చార) రూ.32, బెండకాయలు రూ.42, పచ్చిమిర్చి రూ.34, కాకరకాయలు రూ.32, బీరకాయలు (పందిరి) రూ.42, కాలిఫ్లవర్ రూ.15, కేరట్ రూ.44, గోరుచిక్కుళ్లు రూ.34, ఆనబకాయ రూ.30, దేశవాళీ చిక్కుళ్లు రూ.68, కనుపు చిక్కుళ్లు రూ.90, చేమదుంపలు రూ.40, కంద రూ.67, బీట్‌రూట్ రూ.44, కీరదోస రూ.36, బీన్స్ కాయలు రూ.80, బీన్స్ గింజలు రూ.130, కేప్సికం రూ.74,బొబ్బర్లు రూ.38, పెండలం రూ.30లకు విక్రయించారు. ధరలు ఎంత పెరిగినా కూరగాయలు నిత్యావసరాలు కావడంతో ప్రజలకు కొనుగోలు చేయకతప్పడంలేదు.

చలి, మంచు ప్రభావమేనా..

మార్కెట్లో కూరగాయల ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడానికి వాతావరణ మార్పులు ప్రధాన కారణం అని కూరగాయలు సాగు చేసే రైతులు, కొందరు వ్యాపారులు చెబుతున్నారు. దీనిలో నిజం లేదని మరికొందరు వాదిస్తున్నారు. మార్కెట్ మాయాజాలం కచ్చితంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే రైతు బజార్లలో కొందరు వ్యాపారులకు షాపులున్నాయి. ఈ స్థానిక రైతులు తమ పొలాల్లో ఆనబకాయలు, పొట్టి బీరకాయలు, కాలీఫ్లవర్ వంటివి సాగు చేస్తున్నా రోజువారీ దిగుబడులు మార్కెట్ అవసరాలను తీర్చేస్థాయిలో రావడంలేదు. దీంతో కూరగాయల వ్యాపారులంతా ఇతర జిల్లాల నుంచి మన మార్కెట్లకు సరుకు తీసుకొస్తున్నారు. దీంతో ధరలు పెరుగుతున్నాయి. భోగి పండగలోపు స్థానికంగా కూరగాయల సాగు దిగుబడులు పుంజుకునే అవకాశం లేకపోవడంతో ఈ ఏడాది పెద్ద పండగ సాధారణ, మిడిల్‌క్లాస్‌కు పెద్ద ఆర్థికభారంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరో 16 రీచ్‌లలో ఇసుకను అందుబాటులోకి తెస్తాం

జేసీ చిన్నరాముడు

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో త్వరలో మరో 16 ఓపెన్ రీచ్‌ల ద్వారా 77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపును మంగళవారం పరిశీలించి మాట్లాడారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన హౌసింగ్ నిర్మాణ కార్యక్రమానికి ఇసుక సరఫరా చేసేందుకు కుమారదేవం రీచ్‌ను కేటాయించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ఇసుక సరఫరా విధానాన్ని పరిశీలించామన్నారు. ఇసుక రవాణాను మరింత మెరుగ్గా నిర్వహించాలని బోట్స్‌మన్ సొసైటీ సభ్యులకు సూచించామన్నారు. ఆయన వెంట జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, తహశీల్దార్ దుర్గాప్రసాద్, కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.



గిరిజనం.. జీవన చిత్రం!

ప్రకృతి అందం చూసే కళ్లలో ఉంటుంది.. తీసే చిత్రాల్లో ఉంటుంది.. ఈ చిత్రాలు చూడండి ఎంత అందంగా ఉన్నాయో కదూ.. ఇటువంటి చిత్రాలు మన చుట్టూ కనిపించవు.. ఎందుకంటే ఈ చిత్రాలు ఒక గిరిజన తెగకు చెందినవి.. ఈ రెండు చిత్రాలు బహుమతులు తెచ్చిపెట్టాయి.. అంతరించిపోతున్న గిరిజనజాతి నందు బొండా తెగకు సంబంధించి వారి సంప్రదాయ వేషధారణ నృత్యాలు జీవనశైలి విధానాలపై గత నెల 5,6 తేదీల్లో ఒడిస్సా రాష్ట్రంలో జాతీయస్థాయి హ్యాన్సేన్‌ఖాన్ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్ షాప్‌నకు రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి అభిరామ్‌కు , శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన కొండేపూడి సత్యనారాయణ వెళ్లారు. ఆ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఈ రెండు చిత్రాలకు రెండు అవార్డులు లభించినట్టు మంగళవారం తెలిపారు. - దివాన్‌చెరువు



గుట్టు రట్టు!



కోమటికుంటలో శ్రీమాతంగమ్మ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

5 టన్నులు స్వాధీనం

భాగస్వాములపై కేసు నమోదు

గోపాలపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో కోమటికుంట రెవిన్యూ పరిధిలో శ్రీమాతంగమ్మతల్లి ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం గుట్టు రట్టయ్యింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, కోమటిగుంట గ్రామానికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి మధ్య భాగస్వామ్యంతో కొనసాగుతున్న మిల్లులో అధికారులు 2 రోజుల పాటు తనిఖీలు చేశారు. ఈ రైస్‌మిల్లులో మంగళవారం రెవెన్యూ అధికారులు సుమారు 5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం మండలంలోని కోమటికుంట రెవెన్యూ పరిధిలో కొన్నేళ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా పనిచేసిన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మేకా శేషుబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి, మరో ముగ్గురితో కలిసి మాతంగమ్మ మెట్ట వద్ద శ్రీమాతం గమ్మ ఆగ్రో రైస్‌మిల్లును ఏర్పాటు చేశారు. ఈ రైస్‌మిల్లులో శేషుబాబు కుటుంబంలో నలుగురికి 80 శాతం వాటాలు, మిగిలిన 20శాతం శ్రీరామమూర్తి భాగస్వామ్యంతో పర్మ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది చాలాకాలం పాటు బాగానే నడిచింది. ఇటీవల భాగస్వాముల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ప్రారంభించారు. ఈ మిల్లు నిర్వహణపై ఎప్పటి నుంచో ఎన్నో ఆరోపణలు ఉండడంతో గతంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. అయితే అప్పటికి వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం వీరికి బాగా కలి సొచ్చింది. దీంతో అప్పుడు విషయం బయటకు పొక్కలేదు. ఇటీవల ఇద్దరి భాగస్వాముల మధ్య అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయి. ఇదిలా ఉండగా రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉంచినట్టు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం విష్ణుప్రియ మిల్లు పేరుతో మరొకలోడు ఉన్న విషయం బయటకు పొక్కింది. ఈ మేరకు సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్, పోలీస్, రెవెన్యూ అధికారులు మిల్లును చుట్టుముట్టి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ సంచుల్లో 2,133 కిలోల పీడీఎస్ బియ్యంతో పాటు మరో లారీలో రీసైక్లింగ్ చేసి గోనుసంచుల్లో ఉన్న 580 బస్తాలకు సంబంధించి 3.01 టన్నుల బియ్యం మొత్తంగా 5,233 కిలోలు సీజ్ చేసినట్టు తహశీల్దార్ కె.అజయ్‌బాబు, సీఎస్ డీటీ దివాకర్ తెలిపారు. రైస్‌మిల్లు యజమానులు మేకా శేషుబాబు, వెలగా శ్రీరామ్మూర్తిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం బియ్యాన్ని చిట్యాల శివారులో ఉన్న శ్రీనివాస ట్రేడర్స్ రైస్‌మిల్లులో భద్రపరిచారు. యాజమాన్యంతో పాటు మరోకొంతమందిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

మార్పు మీతోనే సాధ్యం

గురువులే మార్గదర్శులు

- నా తల్లిదండ్రులు కూడా టీచర్లే
- అది నాకు దక్కిన అదృష్టం
- 3వ రోజు యూటీఎఫ్ స్వర్ణోత్సవంలో

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడ జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, సభకు హాజరైన యూటీఎఫ్ ప్రతినిధుల బృందం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజంలో మార్పు తీసుకురాగలరనీ, ఉన్నతమైన సమాజ నిర్మాణం వారి ద్వారానే జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే తనకు ఎంతో గౌరవమన్నారు. తన తల్లిద్రండులు కూడా ఉపాధ్యాయులు కావడం తన అదృష్టమన్నారు. ఉపాధ్యాయులు విద్యను బోధించడం ద్వారా సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసేవారిలో ఉపాధ్యాయులే ముందు వరుసలో ఉంటారన్నారు. తన తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం వల్ల తమ గృహంలో ఎలాంటి పెళ్లిళ్ల కార్యక్రమం జరిగినా ఆహ్వాన పత్రికలు ముందు ఉపాధ్యాయులకే అందిస్తామని, దీని వల్ల చిన్ననాటి నుంచి ఉపాధ్యాయుల సాధక బాధలు తనకు పూర్తిగా తెలుసునన్నారు. నోబెల్ పొజిషన్‌లో ఉన్న ఉపాధ్యాయులంతా ప్రతి రోజు ఒక మంచి సానుకూల దృక్పథంతో ముందడుగు వేయడం ద్వారా మరింత మందిని ప్రభా వితం చేయగలరన్నారు.సభకు వచ్చిన ఉపాధ్యాయులు, మేధావులకు శుభకాంక్షలు తెలిపారు.

జగన్ పాలనలో విద్యావ్యవస్థ నాశనం

ఎమ్మెల్సీ విథపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యాభైఏళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలో తాను కూడా భాగస్వామ్యం అయ్యానని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని... 3,4,5 తరగతులను హైస్కూల్‌లో కలిపి చాలా తప్పిదం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ మైనా విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. నేటి సమాజంలో సంఘంలో ఐక్యత తీసుకురావడానికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలుపించుకోవాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను అందరూ కలిసి రక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీలను నింపాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలన్నారు. 2007నుంచి ఇప్పటివరకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ మద్దతు లభించిన పట్టభద్రులు, ఎమ్మెల్సీలు 14సార్లు గెలుపొందారన్నారు. మార్చిలో జరిగే శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడుతున్న విజయగౌరీని.. కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి పట్ట భద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న తనని గెలిపించాలని కోరారు. తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని 2రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు.

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ప్రపంచబ్యాంకు కను సన్నల్లో నడుస్తుందన్నారు. పేద వర్గాలు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్ర మాదకర పరిస్థితిలో ఉన్న విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. రానున్న రోజుల్లో 24వేల ప్రభుత్వ పాఠశాలలు సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయన్నారు. పార్లమెంటులో చట్టం చేయకుండా కేంద్రం తెచ్చిపెట్టిన నూతన విద్యా చట్టం 2020 విద్యా వ్యాపారానికి అనుకూలం గా ఉందన్నారు. గత విద్యా మహాసభలో యూటీ ఎఫ్ సభ్యత్వం 80వేలు ఉండగా ఈ 17వ విద్యాసభకు అది కాస్తా లక్ష దాటిందన్నారు. ఉపాధ్యా యులకు ఉండే నిబద్ధతకు ఇదే ప్రతీక అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుల, మత, ప్రాంత వర్గాలకు అతీతంగా యూటీఎఫ్ ఉపాధ్యాయులు సమాఖ్యంగా పోరాటం చేయాలన్నారు. మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి సంఘం ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ నివేది కను హనుమంతురావు, మహిళా కమిటీ నివేదికను కుసు మకుమారి, రాష్ట్ర యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను మనోహర్ కుమార్‌లు ప్రవేశపెట్టగా కమిటీ ఏకా గ్రీవంగా తీర్మానించింది. అనంతరం యూటీఎఫ్ అకాడమిక్ అంశాల్లో ప్రతిభ చూపినవారికి జ్ఞాపికలను అందించారు. అనంతరం విప్లవగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కుసుమకుమారి, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు కే.నగేష్, పి.చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శులు అరుణకుమారి, సుభాషిని, కిషోర్‌కుమార్, మోహన్‌రావు, శ్రీలక్ష్మీ, సుభాషిని, అన్నారాం, జ్యోతిబసు, యూటీఎఫ్ కృషిరాష్ట్ర పత్రికాబాధ్యులు ఐ.ప్రసాద్‌రావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటితో స్వర్ణోత్సవాల ముగింపు

గత 3రోజులుగా పీఆర్ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారంతో ముగుస్తాయి. బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకుని ప్రకటిస్తారు



యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

వేటగాళ్ల ఉచ్చుకు.. గిరిజనుడి బలి



మృతిచెందిన గిరిజనుడు శంభురెడ్డి

విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత

మరొకరికి తీవ్రగాయాలు

వై.రామవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువులను హతమార్చేందుకు వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి అనేక మంది గిరిజనులు ప్రాణాలు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. తాజాగా అల్లూరి జిల్లా వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతంలో ఉన్న దారగడ్డ పంచాయతీలో అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతిచెందగా మరొక గిరిజనుడు తీవ్రంగా గాయపడి గుర్తేడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దారగడ్డ పంచాయతీలో బురదవలస గ్రామంలో తాటికొండ వీధికి చెందిన కడబాల శంభురెడ్డి (40) వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగల బారిన పడి మృతిచెందగా అతడి వెంట వెళ్లిన మరో గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమ విద్యుత్ తీగలను ఉపయోగించే వ్యక్తులను నివారించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని దారగడ్డ ఉపసర్పంచ్ సాసుం రాఘవరావు కోరారు.



గాయపడిన మరో గిరిజనుడు

నిబంధనలు అతిక్రమించలేదు

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్
- పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్ కథనంపై స్పందన

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్ కథనంపై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ స్పందించారు. ఆంధ్రజ్యోతికి ఆయన వివరణ ఇచ్చారు. ఫైరింగ్ శిక్షణ జరిగే సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, నిబంధనలు పాటించడం జరుగుతుందన్నారు. ఫైరింగ్ ప్రదేశంలో అక్కడున్న చిన్నారులు ఫైరింగ్ శిక్షణకు వచ్చిన అధికారి సంతానం మాట వాస్తవమే అని చిన్నారుల సంరక్షణకు ఎవరూలేక అక్కడకు తీసుకువచ్చినట్లు వివరణ ఇచ్చారు. ఫైరింగ్ విరామ సమయంలో చిన్నారులను అక్కడికి అనుమతించినట్టు తెలిపారు.

12 వరకు ఎస్సీ కులగణనపై అభ్యంతరాలు స్వీకరణ

తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శోభారాణి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాలు స్వీకరణ గడువును ఈనెల 12 తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎంఎస్.శోభారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు స్వీకరించిన అభ్యంతరాలు ఈ నెల 16వ తేదీ వరకు అధికారులు ఆన్‌లైన్‌లో నమో దు చేస్తారని తెలిపారు. అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కోరారు.

అక్కా అని పిలుస్తూ.. వివాహేతర సంబంధం!



కూళ్లలో హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

కూళ్లలో జరిగిన హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కె.గంగవరం, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మిత్రుల మధ్య గొడవకు అనంతరం హత్యకు వివాహేతర సంబంధమే కారణంగా భావిస్తున్నామని రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ టీఆర్‌కెసి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన హత్య ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతిచెందిన శివ సురేష్ ఇంటికి రోజూ పాలు పోయడానికి వెళ్లేవాడు. సురేష్ భార్యను శివ అక్కా అని పిలిచేవాడు. వారం రోజుల క్రితం శివ పని నుంచి కొంతసమయం ముందే ఇంటికి వచ్చేశాడు. సురేష్ ఇంటి వెనకాల సురేష్ భార్యతో మాట్లాడుకుంటూ ఉండగా ఇది సురేష్‌కు అనుమానం కలిగించింది. దీంతో సురేష్ తన భార్యని పుట్టింటికి పంపించేశాడు. దీనిని మనసులో పెట్టుకున్న సురేష్ శివను మద్యం తాగడానికి రమ్మని పిలిచాడు. అక్కడ వివాహేతర సంబంధం విషయంపై గొడవ పెట్టుకున్నాడు. అక్కడ శివను సురేష్ బ్లేడ్‌తో మెడపై కోసేశాడు. తరువాత దమ్ము చేసిన పొలంలో బోర్లా పడేసి ఊపిరిఆడకుండా మట్టిలో కూరేసి హత్య చేశాడు. గ్రామంలోని వెళ్లి శివను తాను చంపివేశానని కొంతమందికి చెప్పాడు. అనంతరం పరారయ్యాడు. దీనిపై ఇప్పటికే పామర్రు పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారిగా మండపేట రూరల్ సీఐ పి.దొరరాజును, సహాయకునిగా పామర్రు ఎస్‌ఐ ఎస్‌కె.జానీబాషాను నియమించారు. వారి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. శివ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని డీఎస్పీ తెలిపారు.

పొగాకు బ్యారన్‌లో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతవుతున్న పొగాకు బ్యారన్

రూ.6 లక్షలు ఆస్తినష్టం

గండేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలో గొల్లవిల్లి బాబూరావు పొగాకు బాయిలింగ్ చేయడానికి లైసెన్స్ కలిగిన బ్యారన్‌లో మంగళవారం తెల్లవారుజామున సుమారు 5.30గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగే సమయంలో బ్యారన్ పొగాకు పంట ఉంది. సుమారు పొగాకు విలువ రూ.1.50లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. బాయిలింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన బ్యారన్ కూడా పూర్తిగా అగ్నికి దగ్ధమైందని, బ్యారన్ విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని రైతు చెప్పాడు. అగ్ని ప్రమాదం జరగ్గానే రైతులు మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తూ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే బ్యారన్ పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

10న డిప్యూటీ సీఎం పవన్ రాక

- పిఠాపురం, గొల్లప్రోలులో పర్యటన
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఈ నెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. పిఠాపురం లేదా గొల్లప్రోలులో జరిగే సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పిఠాపురం మండలం మల్లాంలోని గోకులం, విరవాడ, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలను, పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని కలెక్టరు పరిశీలించారు. ప్రారంభోత్సవాల అనంతరం పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని సందర్శించే అవకాశం ఉంది. సభ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశరావు, పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు ఉన్నారు.

ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఈనెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. పిఠాపురం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే సభా కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

ప్రసాదం నాణ్యతలో రాజీపడొద్దు

అన్నవరం దేవస్థానం ఈవో



ప్రసాదం రుచి చూస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి అత్యంత ప్రీతికరం, అమృతతుల్యమైన గోధుమరవ్వ ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడొద్దని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సూచించారు. మంగళవారం ఆయన ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలించి ప్రసాదాన్ని రుచి చూశారు. ఏ విధంగా తయారు చేస్తారు, దిట్టం తదితర అంశాలను ప్రసాదం విభాగ ఇన్‌చార్జి పోల్నాటి లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం చాలా రుచిగా ఉందని, మరింత రుచి పెంచేందుకు అవకాశం ఉంటే ప్రయత్నించాలని వంటస్వాములను ఆదేశించారు. ప్యాకింగ్ తయారీ విధానాన్ని పరిశీలించి సిబ్బంది పనితీరును ప్రశంసించారు. పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

ఏడిదలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పాల్గొన్న ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు వాయిద్య కళాకారులు

మండపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలోని శ్రీఅభయ అంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయిదుర్గ నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు వెంటూరి సూర్యనారాయణ సారథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు నుంచి వచ్చిన నిష్ణాతులైన వాయిద్య కళాకారుల కచేరీ మంత్రముగ్ధుల్ని చేసింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. 500 మంది కళాకారుల సంగీత స్వర మాధురితో ఏడిద మార్మోగింది. శాస్త్రీయ సంగీతాన్ని కాపాడుతున్న ఏడిదకు చెందిన వెంటూరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు కళాకారులను టీడీపీ యువ నేత వల్లూరి సాయికుమార్ బాబు సత్కరించారు. కంచికామకోటి ఆస్థాన విద్వాన్ 'సంగీత సామ్రాట్' కె.దుర్గాప్రసాద్, శ్రీలంకకు చెందిన డోలు విద్వాంసుడు ఆర్వీఎస్ శ్రీకాంత్, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి ఆస్థాన విద్వాంసుడు రామవరపు చక్రధరరావు కచేరీ అలరించింది. టీడీపీ నాయకుడు పర్వతిన వీర్రాజు, కళాకారులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నాదస్వర కచేరి, త్యాగరాజస్వామికి ప్రత్యేక అలంకరణ

లారీని ఢీకొన్న మినీ వ్యాన్

సామర్లకోట, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో ఏడీబీ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట ఐఎంఎల్ డిపో నుంచి మద్యం లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ఎదురుగా మరొక వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి ఎదురుగా విశాఖ నుంచి సామర్లకోట రాక్ సిరామిక్‌కు వస్తున్న తమిళనాడుకు చెందిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన 2 వాహనాలను సామర్లకోట పోలీ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

కానిస్టేబుల్ అభ్యర్థులకు

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేస్తున్న ఎస్పీ విక్రాంత్

కాకినాడ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపికలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు 7వ రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. పరీక్షలకు మొత్తం 285మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 233మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షిస్తున్నారు.

హామీలన్నీ నెరవేరుస్తా : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెయిన్ రోడ్డు రోజ్‌మిల్క్ సమీపంలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పది అడుగులు ఎత్తులో శ్లాబ్‌పై ఏర్పాటు చేయిస్తానని వ్యాపారులు, ప్రజలకు హామీ ఇచ్చారు. దాని ప్రకారమే విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి మంగళవారం పదడుగుల ఎత్తులో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయించారు.ఇకపై ఎటువంటి ఇబ్బందులు పడకుండా వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి చాంబర్ పాలకవర్గం సభ్యులు, వ్యాపారులు, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణ

స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ సేవలకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వాసు అన్నారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో పునఃనిర్మాణం చేసిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. వృద్ధాశ్రమం 27వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకుడు గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో 200 మంది వృద్ధులకు రగ్గులు, కాస్మోటిక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మరుకుర్తి రవియాదవ్, స్వర్ణాంధ్ర మేనేజరు హరికృష్ణ, ధనలక్ష్మి, మీరా కుమారి, దివ్య, కొండలరావు, హరిప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో నాసిరకం భోజనం

● విద్యార్థులతో ఆయా దురుసు ప్రవర్తన ● బియ్యంలో వ్యత్యాసం ● సామాజిక తనిఖీ

సీతానగరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రఘుదేవపురం జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భోజనం నాసిరకంగా ఉందని, పాడయిన గుడ్లు పెడుతున్నారని సామాజిక తనిఖీలో వెల్లడైంది. మంగళవారం రఘుదేవపురం జడ్పీ హైస్కూల్లో సామాజిక తనిఖీ గ్రామ సభ జరిగింది. తనిఖీ అధికారి ఎస్.రేణుక మాట్లాడుతూ భోజనాలు చేసే విద్యార్థుల సంఖ్యకు, బియ్యం నిల్వలకు వ్యత్యాసం ఉందని, నాసిరకం భోజనం పెడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు. విద్యార్థుల పట్ల ఆయా అనుచితంగా ప్రవర్తిస్తోందని, హాజరు తక్కువ భోజనాలు చేసిన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా చూపించారని, 4 నెలల నుంచి తేడా కనిపిస్తోందన్నారు. ఈ విషయమై హెచ్‌ఎం ఎం.శ్యామలాదేవి మాట్లాడుతూ రేషన్ షాపుల నుంచి వస్తున్న బియ్యం బస్తాల్లో బస్తాకు 3 కిలోల చొప్పున తక్కువగా వస్తున్నాయని, విద్యార్థులు ఆలస్యంగా రావడం వల్ల ఆన్‌లైన్ హాజరు కంటే విద్యార్థులు ఎక్కువగా వస్తున్నారని అందుకే వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. దగ్గరుండి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నామని పాడయిన గుడ్లు పెట్టడం లేదని గుడ్లు ఎక్కువగా ఉడకడం వలన పైతొక్క ఊడిపోవడంతో పాడయినట్టు చెబుతున్నారన్నారు. ఆయా విషయం విద్యార్థులు తెలపగానే ఆమెను మందలించామన్నారు. బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఇబ్బందులు ఏమైనా ఉంటే భయపడకుండా చెప్పాలన్నారు. కార్యక్రమంలో సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జి కార్యదర్శి జె.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రాజానగరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా 2024-25 సంవత్సరానికి రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ ఏవో ఎం.సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తారన్నారు. దరఖాస్తుదారులు 21-60 ఏళ్ల లోపు వయసున్న బీసీ కులస్తులను అర్హులుగా పరిగణిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఏవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

భగవానుగ్రహంతో మోక్షం

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

అనపర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కలియుగంలో భగవానుగ్రహంతో మెలిగితేనే మోక్షం లభిస్తుందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. అనపర్తి టీటీడీ కల్యాణ మండపంలో శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో మంగళవారం షణ్ముఖ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

పది పరీక్షలకు 25,723 మంది విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో 25,723 మంది విద్యార్థులు ప్రైవేటు, రెగ్యులర్‌గా 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు తెలిపారు. మండలంలోని పిడింగొయ్యిలోని ప్రయివేటు పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వార్షిక పరీక్షల నిర్వహణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్లు రివిజన్ టెస్టుల కార్యక్రమాలను విజయవంతం చేసి తద్వారా జిల్లా ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు కృషిచేయాలన్నారు. పదో తరగతితోపాటు అన్ని తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణ, విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో 100శాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

» నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

» డీఈవో వాసుదేవరావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

గోకవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల పాఠశాల్లోని పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సుజ్ఞాన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల ఆవరణలో ఆహ్లాదకర వాతావరణంతో మంచి ఫలితాలు సాధించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో అలుమ్ని సభ్యులు పిబిశ్రీనివాస్, పరమహంస, సునీల్, సురేంద్ర, ప్రసాద్‌బాబు, శ్రీహరి, నీలి శ్రీనివాస్, రవికుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెంచిన పెన్షన్ చెల్లింపు విషయంలో నిబంధనలను మార్చకుండా గత ప్రభుత్వం అవలంబించిన విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెన్షన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన దివ్యాంగ సంఘ నాయకులు గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ర్యాలీగా దేవిచౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించారు. అలా కాకపోతే ఫిబ్రవరి నెలలో నిరవధిక నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దివ్యాంగులు ఎస్.విజయ, కె.సాయి, ఎ.సురేష్, పి.సుజాత, జి.సత్తిబాబు, ఆర్.సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

కడియం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి తెలిపారు. మంగళవారం వేమగిరిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె విచ్చేసి మాట్లాడుతూ ఈ సదస్సుల్లో రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆర్‌వోఆర్, సర్వే కోసం అర్జీలు అందజేశారు.

ఫ్లెక్సీలు ధ్వంసం.. పోలీసులకు ఫిర్యాదు

గోకవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు చెబుతూ ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ సమీపంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కూటమి నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని టీడీపీ నాయకుడు దిండి వెంకటేశ్వరరావు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో సంబంధిత వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలంటూ వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఫ్లెక్సీలను ధ్వంసం చేసింది మతి స్థిమితంలేని వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి

అనపర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని బాలికల్లో చైతన్యం కలిగించే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ శ్రీను నాయక్ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక సింహాసనంపై నరసన్న

కోరుకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 23వ రోజు మంగళవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేక అలంకరణలతో ఏర్పాటు చేసిన సింహాసనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యాపకులు, అర్చక స్వాములు, ధనుర్మాస భక్త బృందం నరసింహస్వామిని, వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా సేవించుకుని 23వ పాసురాన్ని సింహాసన పాసురంగా స్వామి వారికి విజ్ఞాపన చేశారు. దీనిలో భాగంగానే కోరుకొండ నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి,ఆర్య వైశ్య కోదండ రామాలయం, పశ్చిమగోనగూడెంలో నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామిని, శ్రీకృష్ణుడికి, సీతారామచంద్రులకు ప్రత్యేక సింహాసనాలు ఏర్పాటు చేసి విశేష అలంకరణతో స్వామి ఆశీనులు గావించి తిరుప్పావై పారాయణం చేశారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీలు


రంగంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 9నుంచి 12వరకు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని టీడీపీ నాయకులు ఉండవిల్లి గిరిబాబు, యలమాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, యలమాటి రాంబాబు, బలిరెడ్డి దుర్గారావు మంగళవారం తెలిపారు. రంగంపేటలోని ఏడీబీ రోడ్డు, అట్టల ఫ్యాక్టరీ పక్కనున్న ఖాళీ స్థలంలో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభిస్తామన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు

అనపర్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, జూదం, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీను నాయక్ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎమ్ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'తో నాణ్యమైన ఆరోగ్యం

సీతానగరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఆరోగ్య సేవల కోసమే ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు నిర్మిస్తోందని పర్యవేక్షణాధికారి డాక్టర్ కె.నవీన అన్నారు. మంగళవారం రఘుదేవపురంలో-3 (రాపాక) ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నేషనల్ క్వాలిటి అష్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ తనిఖీ నిర్వహించింది. ఆరోగ్య మందిరాల్లో 14రకాల టెస్టులు, 105 రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు.





కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

మార్పు మీతోనే సాధ్యం!

- ఉన్నతమైన సమాజం నిర్మాణం వారి ద్వారానే..
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో పేర్కొన్న కాకినాడ జిల్లా కలెక్టర్

కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కూడా పాల్గొన్నారు.



తెలుగు పండుగకు ముస్తాబు

- నేడు, రేపు జీజీయూలో ప్రపంచ తెలుగు మహాసభలు
- జీజీయూ కులపతి చైతన్యరాజు సారథ్యంలో ఏర్పాట్లు పూర్తి

- మెయిన్‌లో



యానాంలో మంగళవారం రాత్రి ఓ ప్రదర్శన

- మెయిన్‌లో

జోష్..

సందడిగా యానాం ప్రజా ఉత్సవం

ప్రతి ఏటా పండుగగా జరిగే యానాం ప్రజా ఉత్సవం ఈసారీ సందడిగా జరుగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ వేడుకలు బుధవారం రాత్రితో ముగుస్తాయి.

సంక్రాంతికి పోలీస్ స్టేషన్లలో క్రీడలు

జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్



రాజమహేంద్రవరంసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు జిల్లాలో జూద క్రీడలకు చెక్‌పెడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం కొత్తగా సంప్రదాయ క్రీడల పోటీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎస్పీ డి.నరసింహకిశోర్ మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. యువత దృష్టిని చెడు వ్యసనాల వైపు మరలకుండా సంక్రాంతి పండుగకు పోలీస్ స్టేషన్ల వారీగా సంప్రదాయ క్రీడలు చేపట్టాలని ఆదేశించారు. యువతకు ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు.రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం గత ఐదేళ్లగా నమోదైన ఆస్తి నేరాలపై ఎస్‌హెచ్‌వోలతో సమీక్షించారు. పాత ఆస్తి నేరస్తులపై తప్పక నిఘా ఉంచాలని ఆదేశించారు.2019 నుంచి 2024 మధ్య జరిగిన ఆస్తి నేరాల్లో నిందితులను పట్టుకొని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పి (అడ్మిన్) ఎన్‌బీఎం.మురళీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్ (ఎస్ బీ)అనసూరి శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి , ఐటి కోర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఇరు గ్రూపుల మహిళలు

జనరిక్ మెడికల్ షాపునకు తాళం

రెండో రోజు తారస్థాయికి మందుల షాపు వివాదం

- కలెక్టర్ ఆదేశాలతో తాళం
- జీజీహెచ్ వద్ద ఇరుగ్రూపులు
- రణరంగంగా మారిన ఆసుపత్రి
- పోలీసుల రంగప్రవేశం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి) లోని ప్రభుత్వ జనరిక్ మందుల షాపు వివాదం ముదురుతుండడంతో రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్ పాపారావు మంగళవారం సాయంత్రం తాళం వేయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మందుల షాపునకు తాళం వేయిస్తున్నామని పేర్కొన్నారు. వివాదం తేలే వరకూ రెండు గ్రూపుల వారు ఇక్కడకు రావొద్దని సూచించారు. దీంతో ఈ వివాదానికి తాత్కాలికంగా తెరపడింది. జనరిక్ మందుల షాపు వివాదం మంగళవారం మరింత తారస్థాయికి చేరింది. రెండు మహిళా గ్రూపులకు చెందిన నాయకులు, మద్దతుదారులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంగణమంతా గందరగోళంగా మారింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు చెందిన వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. రెండు గ్రూపుల నుంచి లీగల్ నాలెడ్జి, రూల్ పొజిషన్ తెలిసిన ప్రతినిధులు కూర్చుని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని పోలీసులు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా ఏ ఒక్కరూ తగ్గలేదు. రెండు మహిళా గ్రూపులు అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన మద్దతుదారులే కావడంతో పాటు పార్టీ నాయకులు సిటీ, రూరల్‌గా విడిపోయారు. దీంతో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందనే దానిపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. పోలీసులకు కూడా ఈ సమస్య సున్నితంగా మారడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ఇదిలా ఉంటే సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయం వరకూ వివాదం నడిచినా ఆ తర్వాత సద్దుమణిగింది. ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. మళ్లీ మంగళవారం పొద్దునే రెండు గ్రూపుల నాయకులు, మద్దతుదారులు ఆసుపత్రికి చేరుకోవడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. కలెక్టర్ ఆదేశాలతో తహశీల్దార్ పాపారావు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని షాపునకు తాళం వేయించారు. షాపులో విలువైన మందులు ఉన్నాయని, నష్టపోతామని మహిళా సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.దీంతో వారితోనే షాపునకు తాళం వేయించి వారికే అప్పగించారు.

అలరించేలా!



తొండంగిలోని దానవాయిపేట బీచ్



అన్నవరం ఆలయం

పర్యాటకాభివృద్ధిపై యాక్షన్ ప్లాన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకేం తక్కువ.. అందమైన బీచ్‌లు లేవా.. ఆహ్లాదం పంచే ప్రకృతి ప్రదేశాలు లేవా.. ఆధ్యాత్మికతను పెంచే ఆలయాలు లేవా.. అన్నీ ఉన్నాయి.. అయినా ఏదో వెలితి.. పర్యాటకాభివృద్ధిలో ఎప్పుడూ వెనుకబాటే.. కేరళను మించి అందాలున్నా.. గోవాను మించి బీచ్‌లున్నా ఎందుకో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 బీచ్‌లను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రచించింది.. అంతే కాదు ఆలయాలకు కొత్త రూపు తీసుకురానున్నారు.. సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.. ఫిబ్రవరి నాటికి పర్యాటకంపై నివేదిక ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మూడు జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేస్తున్నారు.

- పర్యాటకానికి స్వర్ణాంధ్ర-2047
- ఐదేళ్లలో ప్రణాళికలపై కసరత్తు
- 18 బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు
- దానవాయిపేట బీచ్‌కు రూ.10 కోట్లు
- హోప్ ఐలాండ్‌కు రూ.8 కోట్లు
- అన్నవరం కొండపై రోప్‌వే
- కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు రూ.5 కోట్లు
- తలుపులమ్మ లోవకు రూ.6 కోట్లు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పర్యాటక రంగాన్ని పరుగులు తీయించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సుదీర్ఘసాగర తీరం దగ్గర నుంచి ప్రఖ్యాత ఆలయాల వరకు పర్యాటకుల కోసం భారీ ప్రాజెక్టులకు పట్టాలెక్కించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో పూర్తిగా కుంటుపడిన పర్యాటక రంగాన్ని గాడినపెట్టేలా అనేక ప్రతిపాదనలతో విజన్‌ప్లాన్ తయారు చేసింది.ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కార్యాచరణ కసరత్తును ప్రభుత్వానికి పంపించారు. అందులో భాగంగా జిల్లాలో సుదీర్ఘ తీర రేఖ పొడవునా అనేక అందమైన బీచ్‌లున్న నేపథ్యంలో వాటిలో ముఖ్యమైన వాటిని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చేయనున్నారు.

మురిపించేలా...

కాకినాడ జిల్లా ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. తొండంగి నుంచి కాకినాడ వరకు సువిశాల సాగరతీరం పర్యాటకులను ఆకర్షిస్తోంది. సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ పర్యాట కులను కట్టిపడేస్తుంది. కోరంగి మడ అడవులు ఎంతో ప్రసిద్ధి. అన్నవరం నుంచి తలుపులమ్మ లోవ, సామర్లకోట భీమేశ్వరస్వామి, పిఠాపురం పురుహితికా అమ్మవారి ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. జాతీయస్థాయి పర్యాటకులను ఆకర్షించే సత్తా ఉన్నప్పటికీ జిల్లాను గత వైసీపీ ప్రభుత్వం పర్యాటకంగా గాలికొదిలేసింది. ప్రస్తుత కూట మి ప్రభుత్వం పర్యాటకరం గంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఐదేళ్ల విజన్ ప్లాన్ తయారు చేస్తోంది. ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్వర్ణాంధ్ర-2047 పేరుతో జిల్లాలో 2029లోగా పర్యాటక రంగం అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రూ.35కోట్లతో పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనల ప్రణా ళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 18 బీచ్‌లను ఏపీ కోస్టల్ జోన్ టూ రిజం మాస్టర్ ప్లాన్ కింద అభివృద్ధి చేసే అవ కాశం ఉందని నివేదికలో వివరించారు. తొలుత తొండంగి మండలంలోని దానవాయిపేటలోని బీచ్‌ను రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారు. వాస్తవానికి ఇక్కడ బీచ్ సువిశాలంగా ఉంటుంది. పర్యాట కులకు సురక్షితంగా ఉంటుంది. అలల తీవ్రత చాలా తక్కువ. పైగా ఇక్కడి నుంచి జాతీయ రహదారి సైతం చాలా దగ్గర.ఈ బీచ్‌ను రూ.10 కోట్లతో తీర్చిదిద్దాలని ప్రతి పాదించారు. అన్న వరం దేవస్థానానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా, పశ్చిమ బెంగాల్ నుంచి భక్తులు వేలల్లో వస్తుంటారు. రత్నగిరి కొండ నుంచి సత్యగిరి కొండకు 800 మీటర్ల పొడవునా రూ.6 కోట్లతో రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి దగ్గర్లోనే దానివాయిపేట బీచ్ కూడా ఉండడంతో పర్యా టకపరంగా ఈ ప్రాంతానికి మరింత ఆదరణ లభిస్తుందని అంచనా వేశారు. కాకినాడ తీరం నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే వచ్చే హోప్ ఐలాండ్ పర్యాటక పరంగా పేరొందింది.గత వైసీపీ ప్రభుత్వం హోప్ ఐలాండ్‌ను గాలికొదిలేసింది. బోటింగ్ నిలిపివేసింది.దీంతో పర్యా టకులు ఉసూరోమంటున్నారు.హోప్ ఐలాండ్‌కు తిరిగి నాటి వైభవం వచ్చేలా చేయడంతో పాటు ఎకో టూరిజం ప్రాజెక్టు కింద రూ.8 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అనేకమంది వస్తుంటారు.ఇక్కడ ఇప్పటికీ కనీస సదుపాయాలు లేవు.చీకటైతే చిన్న లైట్ ఉండదు.ఈ బీచ్ వద్ద రూ.5 కోట్లతో సర్వహంగులు తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. బీచ్ ఫ్రంట్ వద్ద కన్వెన్షన్ హాల్ నిర్మించ ను న్నారు. తలుపులమ్మ లోవ ఆలయం వద్ద రూ.6 కోట్లతో వివిధ వసతులను తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. కాకినాడ జిల్లాలో మొత్తం ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద 18 బీచ్‌లను తీర్చిదిద్దాల్సి ఉందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో వివరించారు.అటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కోనసీమలో హోటళ్ల, రిసార్టుల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తున్నాయని..వీటికి అనువైన భూములు గుర్తించి పంపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

టార్గెట్ ఫిబ్రవరి

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఫిబ్రవరి నాటికి నివేదికలు పంపాలని కలెక్టర్లను ఆదేశించింది. ప్రధానంగా కాకినాడ కోరంగి వద్ద ఫోర్ సీజన్ హోటల్ పెట్టుబడులకు ముందుకు వచ్చింది.దీనికి 40 ఎకరాలను ఎంపిక చేసి ప్రతి పాదలను పంపాలని సూచించింది.రాజమహేంద్రవరంలో ఐఆర్‌సీటీసీకి 3 ఎకరాలను అన్వేషిం చి వివరాలు పంపాలని కోరింది. కోనసీమలోని పిచ్చుకలంక వద్ద మహీంద్రా హాలిడేస్ క్లబ్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇందుకు 26 ఎకరాల వరకు అవసరమని అంచనా వేశారు.దీనికి సంబంధించి నివేదికలను ఫిబ్రవరిలో పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. స్వదేశీ దర్శన్ స్కీం కింద కోనసీమ, పాపికొండలను అభివృద్ధి చేయాలని నిర్ణ యించింది. వీటికి భారీగా నిధులు రాను న్నాయి. ఏడు పర్యాటక యాంకర్ హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో రాజమ హేంద్రవరంలో పర్యాటకపరంగా ఇంకా ఏమేం చేయాలనే దానిపై సలహాలు, సూచనలు, ఆలోచనలు ఫిబ్రవరిలోగా పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.



వైరస్‌పై ఆందోళన వద్దు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇదిగో వైరస్ వచ్చేసిందంటూ సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో మంగళవారం ఆయన రాజమహేంద్రవరం జీటీజీహెచ్ (ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి)లో పల్మనాలజిస్ట్ డాక్టర్ రవికిరణ్, ఆర్‌ఎంవో డాక్టర్ ప్రణవ్, ఇతర వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఇతర వైద్యపరమైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరస్ విషయంలో ప్రజలు తప్పనిసరిగా మాస్కు ధరించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ అంతటి ప్రమాదకరమైందని కాదన్నారు.ఏ మాత్రం అనారోగ్యంగా ఉన్నా, జలుబు చేసినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముందుజాగ్రత్తగా రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేసినట్టు తెలిపారు.

పండుగకు విజిట్రబుల్స్!



- కూరగాయలు అధరహో
- కొనుగోలుదారులు బెధరహో
- బహిరంగ మార్కెట్లలో దోపిడీ
- కిలోకి రూ.20పైనే పెంచి విక్రయం
- రైతు బజార్లలోనూ ధరల బేజార్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. రైతు బజార్లలోనే కిలో టమాటా రూ.16 నుంచి రూ.18 లకు విక్రయిస్తున్నారంటే బహిరంగ మార్కెట్లలో పరిస్థితిని ఊహించవచ్చు. రైతు బజార్లలో ధరల కంటే బహిరంగ, చిల్లర మార్కెట్లలో రెట్టింపు, అంతకు మించి ధరల్లో కూరగాయలను విక్రయిస్తున్నారు. బహిరంగ, చిల్లర మార్కెట్లలో దొండకాయలు, బెండకాయలు కిలో రూ.70-రూ.80పైనే అమ్ముతున్నారు. బెండ, దొండకాయలతో సమానంగా బీరకాయలు రేట్లు పలకడం గమనార్హం. పచ్చిమిర్చి రూ.60లకు చేరింది. గుత్తి వంకాయ (గులాబీ రకం) రూ.80,చేమ దుంపలు రూ.80, మీడియం సైజు ఆనబకాయ రూ.50, ములక్కాడ ఒకటి రూ.15, చిక్కుళ్లు రూ.150 ఇలా అన్ని కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కేరట్, బీట్‌రూట్ కిలో రూ.100కు చేరుకున్నాయి. కేప్సికం రూ.130లకు పెరిగింది. రైతు బజార్లలో కిలో టమాటా రూ.16లు ఉంటే బహిరంగ,చిల్లర మార్కెట్లో రూ.40లు చెబుతున్నారు.ఈ లెక్కన రైతుబజార్లలో రూ.20ల కంటే తక్కువకే కిలో టమాటాలు వస్తాయన్నమాట.ఇలా బహిరంగ మార్కెట్లలో ధరల మోత మోగుతోంది.

రైతు బజార్లలో ధరలిలా..

రైతుబజార్లలోనూ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. రైతుబజార్లలో ఆదివారం కిలో టమాటా రూ.16లకు, దొమ్మేరు వంకాయలు రూ.54, గులాబీ రకం రూ.44, నలుపు (జాళ్లు) రూ.38, తెలుపు (చార) రూ.32, బెండకాయలు రూ.42, పచ్చిమిర్చి రూ.34, కాకరకాయలు రూ.32, బీరకాయలు (పందిరి) రూ.42, కాలిఫ్లవర్ రూ.15, కేరట్ రూ.44, గోరుచిక్కుళ్లు రూ.34, ఆనబకాయ రూ.30, దేశవాళీ చిక్కుళ్లు రూ.68, కనుపు చిక్కుళ్లు రూ.90, చేమదుంపలు రూ.40, కంద రూ.67, బీట్‌రూట్ రూ.44, కీరదోస రూ.36, బీన్స్ కాయలు రూ.80, బీన్స్ గింజలు రూ.130, కేప్సికం రూ.74,బొబ్బర్లు రూ.38, పెండలం రూ.30లకు విక్రయించారు. ధరలు ఎంత పెరిగినా కూరగాయలు నిత్యావసరాలు కావడంతో ప్రజలకు కొనుగోలు చేయకతప్పడంలేదు.

చలి, మంచు ప్రభావమేనా..

మార్కెట్లో కూరగాయల ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడానికి వాతావరణ మార్పులు ప్రధాన కారణం అని కూరగాయలు సాగు చేసే రైతులు, కొందరు వ్యాపారులు చెబుతున్నారు. దీనిలో నిజం లేదని మరికొందరు వాదిస్తున్నారు. మార్కెట్ మాయాజాలం కచ్చితంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే రైతు బజార్లలో కొందరు వ్యాపారులకు షాపులున్నాయి. ఈ స్థానిక రైతులు తమ పొలాల్లో ఆనబకాయలు, పొట్టి బీరకాయలు, కాలీఫ్లవర్ వంటివి సాగు చేస్తున్నా రోజువారీ దిగుబడులు మార్కెట్ అవసరాలను తీర్చేస్థాయిలో రావడంలేదు. దీంతో కూరగాయల వ్యాపారులంతా ఇతర జిల్లాల నుంచి మన మార్కెట్లకు సరుకు తీసుకొస్తున్నారు. దీంతో ధరలు పెరుగుతున్నాయి. భోగి పండగలోపు స్థానికంగా కూరగాయల సాగు దిగుబడులు పుంజుకునే అవకాశం లేకపోవడంతో ఈ ఏడాది పెద్ద పండగ సాధారణ, మిడిల్‌క్లాస్‌కు పెద్ద ఆర్థికభారంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరో 16 రీచ్‌లలో ఇసుకను అందుబాటులోకి తెస్తాం

జేసీ చిన్నరాముడు

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో త్వరలో మరో 16 ఓపెన్ రీచ్‌ల ద్వారా 77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపును మంగళవారం పరిశీలించి మాట్లాడారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన హౌసింగ్ నిర్మాణ కార్యక్రమానికి ఇసుక సరఫరా చేసేందుకు కుమారదేవం రీచ్‌ను కేటాయించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ఇసుక సరఫరా విధానాన్ని పరిశీలించామన్నారు. ఇసుక రవాణాను మరింత మెరుగ్గా నిర్వహించాలని బోట్స్‌మన్ సొసైటీ సభ్యులకు సూచించామన్నారు. ఆయన వెంట జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, తహశీల్దార్ దుర్గాప్రసాద్, కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.



గిరిజనం.. జీవన చిత్రం!

ప్రకృతి అందం చూసే కళ్లలో ఉంటుంది.. తీసే చిత్రాల్లో ఉంటుంది.. ఈ చిత్రాలు చూడండి ఎంత అందంగా ఉన్నాయో కదూ.. ఇటువంటి చిత్రాలు మన చుట్టూ కనిపించవు.. ఎందుకంటే ఈ చిత్రాలు ఒక గిరిజన తెగకు చెందినవి.. ఈ రెండు చిత్రాలు బహు మతులు తెచ్చిపెట్టాయి.. అంతరించిపోతున్న గిరిజనజాతి నందు బొండా తెగకు సంబంధించి వారి సంప్రదాయ వేషధారణ నృత్యాలు జీవనశైలి విధానాలపై గత నెల 5,6 తేదీల్లో ఒడిస్సా రాష్ట్రంలో జాతీయస్థాయి హంస్సేన్‌ఖాన్ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్ షాప్‌నకు రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి అభిరామ్‌కు , శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన కొండేపూడి సత్యనారాయణ వెళ్లారు. ఆ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఈ రెండు చిత్రాలకు రెండు అవార్డులు లభించినట్టు మంగళవారం తెలిపారు. - **దివాన్‌చెరువు**



బాలికల సంరక్షణ అందరి బాధ్యత

» కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ » కిశోరి వికాసంపై శిక్షణా తరగతులు



కొవ్వూరులో మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయ సెక్రటరీలు, అంగన్వాడీ కార్యకర్తలకు కిశోరి వికాసంపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. కౌమార దశలో బాలికలు ఎదుర్కొనే సమస్యలు, సంక్షేమం, రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఆడపిల్లలను కాపాడుకోవాలని, చదివించుకోవాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారని, డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేసి మహిళలను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో కె.సుశీల మాట్లాడుతూ కిశోరి వికాసంపై శిక్షణ పొందిన సిబ్బంది వారి సచివాలయాల పరిధిలో ఉన్న 11నుంచి 18 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలకు కౌమార దశలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం టీవోటీలు బాల్య వివాహాల నిర్మూలన, చైల్డ్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, మొబైల్ యాప్‌లు, ఇన్‌స్ట్రాగ్రామ్‌కు అలవాటు పడి పిల్లలు ఏవిధంగా మోసపోతున్నారో వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ పి.విశ్వం, ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి మాట్లాడుతూ 11నుంచి 14ఏళ్ల వయసున్న బాలికలు గ్రామీణ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కిషోరి వికాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కౌమరదశలో బాలికల ఆరోగ్యం, పోషణ, విద్య తదితర అంశాలపై దృష్టి పెడుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అజయ్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో జీ.శ్రీనివాసరావు, ఏసీడీపీవో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు

ఉండ్రాజవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కె.సావరం గ్రామదేవత ముత్యాలమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నట్టు సర్పంచ్ నార్ని రామకృష్ణ తెలిపారు. గ్రామంలో కూడళ్లతోపాటు వీధుల్లో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. జాతర ప్రారంభం రోజున 650 గ్రాముల బరువున్న నూతన స్వర్ణ కిరీటాన్ని ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి అలంకరిస్తామన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి


నిడదవోలు: సమిశ్రగూడెంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై మంగళవారం సెమినార్ నిర్వహించారు. విజయవాడ కేఎల్ యనివర్శిటీ అడ్మిషన్ కోఆర్డినేటర్ వై.శివప్రసాద్, ప్రొఫెసర్లు ఎ.శ్రీకాంత్, ఎన్.వెంకటరమణ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలు ఎన్ని ఉన్నాయో, వాటిని ఎలా అందిపుచ్చుకోవాలో, కెరియర్‌ను ఎలా మలచుకోవాలో అవగాహన కల్పించారు. కెఎల్ యూనివర్శిటీ ఎంబీఏ, ఎంసీఏలకు సంబంధించిన రాత పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ కేఎల్ యూనివర్శిటీ ప్రతినిధులను, యూనివర్శిటీ స్థాయిలో ఆయా గ్రూపుల్లో ప్రథమంగా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌తోపాటు ఎడ్వయిజర్ ఎన్‌వీ సుబ్బారావులను కేఎల్ యూనివర్శిటీ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, కె.సూరిబాబు పాల్గొన్నారు.

నిడదవోలు: సమిశ్రగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కన్వీనర్ కోడూరి రాజా పుష్పవతి మాట్లాడుతూ తమ సంస్థ సమాజ సేవా కార్యక్రమాలతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బుక్స్, మెమెంటోలు అందించి మరో విద్యార్థి సాయికుమార్ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బోయపాటి రామలక్ష్మి, కటారి శారదాదేవి, సత్యనారాయణరాజు, భారతీదేవి, మానవత ప్రతినిధులు పాల్గొన్నారు.

కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సులు

ప్రత్యేక సింహాసనంపై నరసన్న

కోరుకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 23వ రోజు మంగళవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేక అలంకరణలతో ఏర్పాటు చేసిన సింహాసనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు, ధనుర్మాస భక్త బృందం నరసింహస్వామిని, వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా సేవించుకుని 23వ పాసురాన్ని సింహాసనంగా స్వామికి విజ్ఞాపన చేశారు.దీనిలో భాగంగానే కోరుకొండ నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి, ఆర్య వైశ్య కోదండ రామాలయం, పశ్చిమగోనగూడెంలో నరసింహస్వామి,వేంకటేశ్వరస్వామిని,శ్రీకృష్ణుడికి, సీతారామచంద్రులకు ప్రత్యేక సింహాసనాలు ఏర్పాటు చేసి విశేష అలంకరణతో స్వామి ఆశీనులు గావించి తిరుప్పావై పారాయణం చేశారు.

ప్రతి నెలా మండల సమాఖ్యల సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తేజస్విని

పెరవలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని డ్వాక్రా సంఘాలు, గ్రామ సంఘాలు మండల సమాఖ్యల సమావేశాలను ప్రతి నెలా జరపాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ ఏపీఎం రామకృష్ణ తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షురాలు జన్ని మాధవి అధ్యక్షతన మండల సమాఖ్య కార్యనిర్వహక సభ్యుల సమావేశం నిర్వహించారు. సంఘాలు రికవరీ సొమ్ము చెల్లించినపుడు అన్ని సక్రమంగా జమయినవి లేనివి ప్రతి నెలా సభ్యులు చూసుకోవాలన్నారు. స్త్రీ నిధి ఏజీఎం ధర్మేంద్ర, మేనేజర్ రత్నకుమారి మాట్లాడుతూ స్త్రీ నిధి పొందిన సభ్యులందరూ సకాలంలో సొమ్ములు చెల్లించాలన్నారు. డాక్టర్ ఎం.తేజస్విని గైనకాలజీకి సంబంధించి విషయాలను సభ్యులకు తెలిపారు. క్యాన్సర్ వ్యాక్సిన్ గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ అనుకుల శివ కాశీ ధర్మారావు, కోశాధికారి రామలక్ష్మి, డీసీ కనకదుర్గ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

కొవ్వూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాతవూరు ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పాత వూరులోని వరద గోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆంజనేయస్వామికి సామూహిక తమలపాకుల పూజలు చేశారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కజొన్న మిషన్ పడి వ్యక్తి మృతి



గోపాలపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న మిషన్ ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వివరాల మేరకు మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన పొట్రా లక్ష్మణరావు(40) వ్యవసాయం చేస్తుంటాడు. తాను చేస్తున్న పొలంలో మొక్కజొన్న మాసూలు చేసేందుకు వేరే రైతు నుంచి మిషన్ తెచ్చుకున్నాడు. ఊరిలో నుంచి మిషన్‌ను పొలానికి భుజం మీద పెట్టుకుని మోసుకొస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో మిషన్ తలకు తగలడంతో బలమైన గాయమై లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు 25,723 మంది విద్యార్థులు

» 100% ఉత్తీర్ణత సాధించాలి
» డీఈవో వాసుదేవరావు



రాజమహేంద్రవరం రూరల్ జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో 25,723 మంది విద్యార్థులు ప్రైవేటు, రెగ్యులర్‌గా 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు తెలిపారు. మండలంలోని పిడింగొయ్యిలోని ప్రయివేటు పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వార్షిక పరీక్షల నిర్వహణపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్లు రివిజన్ టెస్టుల కార్యక్రమాలను విజయవంతం చేసి తద్వారా జిల్లా ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు కృషిచేయాలన్నారు. పదో తరగతితోపాటు అన్ని తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణ, విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాం పీపుల్స్ కల్చర్ ఫెస్టివల్‌కు పాండిచ్చేరి గవర్నర్

మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికిన కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్


పాండిచ్చేరి గవర్నర్ కైలాష్‌నాథన్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో సుస్మిత

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): యానాంలో జరిగే 21వ పీపుల్స్ కల్చర్ ఫెస్టివల్ 2025 వేడుకల్లో పాల్గొనేందుకు హాజరైన పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్‌నాథన్ మంగళవారం హైదరాబాద్ నుంచి మధురపూడి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు.ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్, ఆర్డీవో కృష్ణనాయక్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.మధురపూడి ఎయిర్‌పోర్ట్ నుంచి గవర్నర్ రోడ్డు మార్గం గుండా కొవ్వూరు వెళ్లారు. రాత్రి బస చేయడానికి అవంతి ఫీడ్స్ అతిథి గృహానికి చేరుకున్న గవర్నర్‌ను ఆర్డీవో రాణి సుస్మిత మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం ఉదయం యానాం బయలుదేరి వెళతారు. పీపుల్స్ కల్చర్ ఫెస్టివల్ 2025, ఫ్లవర్ షోలలో పాల్గొంటారు. రాత్రికి యానాంలో బసచేస్తారు. 9న ఉదయం యానాం నుంచి బయలుదేరి ఉదయం 9:45 గంటలకు రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు.ఉదయం 10:15 గంటలకు విమానంలో బయలుదేరి హైదరాబాద్ వెళతారు.

పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఆత్మీయ సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు కృష్ణంరాజు

నిడదవోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో కాలువల పూడికతీతకు ప్రాధాన్యమిస్తామని పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు మురళీ కృష్ణంరాజు అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయంలో పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ నీటి సంఘాల అధ్యక్షులు అధికారులను సమన్వయ పరుచుకుంటూ డెల్టా పరిధిలోని కాలువల సమస్యల పరిష్కార దిశగా ముందుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో డెల్టా పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు వెండి పళ్లెం అందజేత

నిడదవోలు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లికి మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన ఏరుకొండ సూర్యనారాయణ, కనకదుర్గ దంపతులు 760 గ్రాముల వెండి పళ్లేన్ని బహూకరించారు. పళ్లేన్ని ఆలయ సూపరింటెండెంట్ జెల్లా సోమరాజుకు అందజేసి, అమ్మవారి పూజా కైంకర్యాల్లో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పాల్గొన్నారు.

కోడిపందాలు జరగకుండా చూడాలి

పెరవలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఏ గ్రామంలోనూ కోడిపందేలు, గుండాట, పేకాట జరగకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలపై ఉందని తహశీల్దార్ అచ్యుతకుమారి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనుమానితుల వివరాలు కూడా తెలియజేయాలన్నారు.

ఏఎన్ఎంపై ఆశా వర్కర్ల ఫిర్యాదు



తాళ్లపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుగుడుమెట్ట సచివా లయంలో ఏఎన్ఎంపై ఆశావర్కర్లు మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎన్ఎం శ్యామల విధి నిర్వహణలో తమ పట్ల అమర్యాదగా వ్యవహరిస్తోందని, అంతేగాక తాను చెప్పిన మాట ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తుండడంతో మలకపల్లి పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్లు నిరసన తెలిపి డాక్టర్ అన్నపూర్ణకు వినతిపత్రం అందజేశారు. ఆమె దురుసు ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.బేబీకుమారి, వై.భవానీ, గెతంబులి మంగ, నాగలక్ష్మి, ఎస్.ముసలమ్మ పాల్గొన్నారు.

వేళ్లచింతలగూడెంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



గోపాలపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వేళ్లచింత లగూడెం గ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. పోటీలను సీఐ నాగేశ్వర్‌నాయక్, ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ ఛైర్మన్ గంటా మధుకృష్ణ ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖ జిల్లాల టీమ్‌లు పాల్గొంటున్నట్టు సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు పశ్చిమగోదావరి జిల్లా, శ్రీకాకుళం జట్లు పోటీ పడ్డాయి. కార్యక్రమంలో కొర్లపాటి రాము, పిన్నమనేని చినబాబు తదితరులు పాల్గొన్నారు.